



# మెడ మీద వేలాడే కత్తి

శ్రీనివాసమూర్తి

In the special court of atrocities against S.C. & S.T. Act (1989) Crime No. 39/95.
Madiga Maddanna S/o Madiga Naganna Vs. E. Ellanna Goud, S/o E. Swamanna

పాతకాలపు ముసలి భవనం.

గోడకు దుప్పికొమ్ములు.. జింక చర్మం...

ఏ వేటగాడి పరాక్రమమో ?

లోపల టేబుల్... ఎదురుగా కుర్చీ... పక్కనే పదేళ్ల పిల్లవాడు కళ్లెగరేశాడు... చెవి వైపు చూపించాను.

అదోరకం నవ్వు... ఎంత నిర్లక్ష్యం?

ముసలి డాక్టరు... చెక్క స్టూలు జరిపాడు, కూర్చున్నా. చెవి లోపలికి టార్చిలైటు వెలుతురు...

"లాభం లేదు. కండ పెరిగింది... మెదడులో నుండి... నరికి పారెయ్యాలి!"

"మెదడునా? కండనా?"

"వుహూ! కింద కూర్చో," మంగలి రంగన్న ఇరికిచ్చుకున్నట్టు రెండు కాళ్ల మధ్య...

కండరం చుట్టూ స్పిరిట్...

ఇంత నిషేధంలోనూ... ఎంత తియ్యని వాసన మత్తుగా వుంది... అధికారం లాగా.

వొక్కొక్క పొరా తరుగుతూ వుంది. డాక్టరు చెయ్యి...

అరే! నాకు కనిపిస్తూ వుందే! నా చెవేనా?

యేసేబు రంపెతో వొక్కొక్క పొరనూ తీస్తున్నంత నైపుణ్యం... నా లోపల... అదే పులకరింత...

కండ మొదలు దొరకడంలేదు... తరిగిన కొద్దీ పెరిగింది. వొళ్లు వేడిగా... రాత్రికి జరమొస్తుందేమో?

సర్...ర్..క్...క్. కత్తి దిగబడింది.

రక్తం... ఎగజిమ్మింది.

కడుపులో తిప్పే వాసన... ఎగిరి... ఎగిరి డాక్టరు ఎలుగు పట్టులోంచి స్టూలు మీదికి... ఆస్పత్రి అంతా నావైపే.

అంత విచిత్రమా?

మోచెయ్యి కింద సలపరం... గీరితే అక్కడా రసి.

మళ్లీ పిల్లవాడు నావైపే చూస్తున్నాడు... నా చేతివైపే.

నాతో వాడికేం పని.

నోరు పగిలిపోయిన శబ్దం...

పిల్లవాడి మొహంలో కోట్ల ఆశ్చర్యాలు... కోటానుకోట్ల భయాలు.

భయపడడం దేనికి? అందరికీ పెద్దాయనే దేవుడు.

మోచెయ్యి కింద తడి... గీరుకున్నాను. గీరిన చోట నాలిక మొలిచింది. మోచేతికి నాలిక... కిందికి వేలాడింది... దాని వెంట రసి... వొరుస్తూ వుంది. అంత కంతకూ పెరిగింది... సాగి సాగి బారు తీరింది. సాగి... సాగి... ఛలక్... కొస వంపు తిరిగింది.

అది వేటకొడవలి... నిగనిగలాడుతూ... రక్తం వొరుస్తూ...

నెత్తురు వాసన... శవం కుళ్లిన వాసన... నెత్తురూ చీమూ కలగలసిన వాసన... మార్చురీ వాసన... మనుషుల వాసన, చచ్చిన మనుషుల వా...స...న...

పిల్లవాడు భయంతో అరిచాడు..

నాలిక దూసుకొచ్చింది. వేట కొడవలి దూసు కొచ్చింది. సలక్‌మని... డాక్టరు మెడను చుట్టింది. ముక్కు కొసల్లో ఊపిరి స్తంభించింది...

అమ్...మ్...మ్మా... విహ్వలమైన అరుపు. దబ్!... ఏదో పడింది.

*

ఉలిక్కిపడి లేచినాడు దేవరత్నం.

వొళ్లంతా  చెమటలు... చెయ్యి పురి తిప్పిన బాధ...

గొంతులో నొప్పి... తడారిపోయి గుచ్చు కుంటున్నది.

కూడదీసుకుని లేవాలని ప్రయత్నం. కాలూ చెయ్యి కదలడంలేదు. కళ్ల ముందు కదలాడుతున్న దృశ్యాల వెనుక...

మెడ మీద వేలాడుతున్న కత్తి...

వాసన... వాసన. తెరలు తెరలుగా కమ్ము కుంటున్న వాసన. ఎక్కడున్నా నేను... మార్చురీలోనా... ఎవరినైనా పిలుద్దామా? నోరు పెగలడం లేదు.

కలుసుకొని విడిపోతున్న వలయాలు...

లేవడానికి ధైర్యం చాలడంలేదు.

వలయాలు వొక్కక్కటీ జిల్లేడుపూలలాగా తేలిపో తున్నాయి. వలయాలు వెనుక అందంగా అమర్చుకున్న రాకులలో 'లా' పుస్తకాలు... జర్నల్స్...

'రూములోనే వున్నానా?' మంచం మీద నుంచే వెతుక్కుని స్విచ్ వేసినాడు.

కలా!... తలుచుకుంటేనే వణుకు. గుండెదడ ఇంకా చెవుల్లోకి వినిపిస్తున్నది.

చెయ్యి కదిలించాడు. అబ్బా! నొప్పి... దుప్పటి మీద పుస్తకం... రాక్‌లోంచి  పడిందేమో?

మంచం దిగి గ్లాసెడు నీళ్లు తాగాడు.

కలలో దృశ్యాలు కళ్ల ముందే వున్నాయి. వాసన తో సహా ప్రతి వొక్కటీ గుర్తుకొస్తున్నాయి... వాసన... వాసన... పోల్చుకోవాలని ప్రయత్నించాడు. లేచి కుర్చీలో కూర్చున్నాడు.

మార్చురీ వాసన... పొద్దున్నే పెద్దాసుపత్రిలో మార్చురీలో వచ్చిన వాసన... ముక్కులు పసికట్టి నాయి... మెదడు గుర్తించింది.

వోబులేసు... వోబులేసు చావు గురించిన కలనా?

ఊపిరి గడ్డకట్టినంత నిశ్శబ్దం...

ప్రయత్నించి వుంటే వోబులేసు బతికేవాడా? పట్టించుకోనందువల్లే చచ్చిపోయాడా? చావుకు కారణం తనేనా?...

*

శుక్రవారం పొద్దున

దేవరత్నం కోర్టుకు పోవడానికి సిద్దమవుతున్నాడు. ఎదురుగా వాకిట్లో కొచ్చి నిలబడినాడు మద్దన్న.

''నాయినా! పిల్లోన్ని కాంతరెడ్డి మనుషులు పట్కపోయినారు. నువ్వే కాపాడల్ల.''

''ఏమైంది?''

''వారం దినాల కింద రెడ్డి పైలటు ఎల్లన్న గౌడు ఇంటికాడ కక్కసుగుంత తీపిచ్చి, కటకం కట్టనీకి నన్ను పనికి పిలంపినారు. నేనూ, ఇద్దరు పనోల్లూ పాయినాం. తొల్రోజు పనోల్లకాడికి కూలి ఇచ్చినారు. నాకు మాత్రం రేత్రికి వోళ్ల కల్లుపెంటలో కల్లు పోపిచ్చినారు.

''రేపు గూడ్క పనుంది గదా! మళ్లీ రాపో,'' అన్నారు. మర్రోజు పని అయిపోయింది. కూలోల్లకు కూలి ఇచ్చినంక ముప్పై రూపాయిలు నా చేతిలో పెట్టి సరిపోయిందన్నారు. నేనేం మాట్లాల్లా. ఇచ్చిన లెక్క దీసుకోని ఇంటికొచ్చినా. మావోడు వోబులేసు ఊరు కుండే పిల్లోడుగాదు. పొద్దున్నే కల్లుపెంట కాడికే పోయి నాడు. ఈని అదురుష్టానికి గౌడు లేడా పొద్దు.

'రెండ్రోజులగ వొళ్లిరగ పని చేపిచ్చుకోని మూడొ క్కలు చేతులో పెడ్తారా! ఇదేం అన్యాయం,'' అనడిగి నాడు.

''యిచ్చినంత తీస్కోవాల్లే! యేం! మాకాణ్ణే నీలుగుతున్నావా?'' అని మావోణ్ణి బైటికి దొబ్బినారు.

''వీడు ఆడికైనా సక్కురుమంగ వుండేటోడా! సక్కగొచ్చి సంగం కాడ చెప్పినాడు.''

రేత్రికి గౌడు వొచ్చినాడు. వాయనకు ఇదంతా తెల్సింది. పిల్లోని తోలకరమ్మని మనిషినంపిచ్చినాడు.

వోబులేసు ఇంట్లో లేడు. రెండో ఆట సినిమాకు పొయ్యినాడు. వాడు లేకపోతే నన్నే రమ్మన్నారు. సారాయి గోడౌను కాడికి తోలకపొయినారు. లోపలికి పోతానే తలుపులేసి దభీ, దభీమని గుద్ది కింద పడ నూకినారు.

''మాదిగ నాకొడక! గొండాలను పిలిపిచ్చుకుండా, తెలిసినోనివి గదా, బతకనీ అని నిన్ను కూలికి పిలిస్తే, నువ్వూ నీ కొడుకూ మస్తు నీల్గుతున్నారంట. యేందిలే! నీ కొడుకు కల్లు పెంటకాడి కొచ్చి కొట్లాట పెట్టుకున్నా

డంట. మకురు బట్నారా!'' గౌడు అట్నే ఎగిర్నాడు.

''లేదు సామీ! న్యాలంగా రావాల్సిన లెక్క అడిగి నాం,'' అని చెప్తున్నా.

''లెక్కేందిరా లెక్క? ఇచ్చినంత తీస్కోని గు... మోసుకోని పోవల్ల. అడిగేంత దొమ్మపొకురా! నీ కొడుకు యువజన సంగం కాడికి పోయినాడంట. పోనీలే అని వూరుకుంటే లేపి ఆడిస్తున్నాడు...''

''అంత పెద్ద మాటలు ఏంటికి దొరా!'' అంటున్నా యినిపిచ్చుకోలా!

''లే! ఆ సిలవరిలోటా పట్కరా! నోట్లో వుచ్చలు బొయ్యండి యీ లం... కొడుక్కి. అప్పుడుగానీ మకురు అణగదు. మాదిగోన్ని ఎంకటా? అంటే మరింత నీల్గు తాడు. యాడ బెట్టోటోణ్ణి ఆణ్ణే బెట్టల్ల. బూడ్సుండి నా కొడుకును... ఎవురి మనుషులు అనుకున్నాడో ఏమో?...'' గౌడు ఈ తీరాన తిడ్తాంటే, సంజన్నగాడు దొమ్మల మీద ఎక్కి కూచ్చున్నాడు.

''బిగబిట్టి నోట్లో వుచ్చలు బోసి....'' ఇంక మద్దన్న నోట్లో మాట రాలేదు. పది నిముషాలు కుల్లి, కుల్లి యేడ్చినాడు. దేవరత్నంకు ఏమని సముదాయించాలో కూడా తెలీలేదు. తన వేరూ అక్కణ్ణే వుంది.

''ఎంత మాదిగోన్ని అయితే మాత్రం ఇంత హీనమా బతుకు. కూలి అడిగితే ఇట్ల జేస్తారా! సదువు కున్నోనివి నువ్వే చెప్పు,'' మళ్లీ దుఃఖంతో గొంతు పూడి పోయింది. మీదున్న వొల్లెతో కళ్లు తుడుచుకున్నాడు.

''నేను గాబట్టి అవుమానం దిగమింగుకోనున్నా! మావోడు వుండల్యాకపోయినాడు. సంగమోళ్లతో కలిసి ఎమ్మార్వోకు అర్జీ ఇచ్చినాడు.

''వాయనేం మాట్లాడ్తాడు. బో! పెద్దమనిషి. 'పెద్దోళ్లతో రచ్చలేంటికి లెమ్మని,' బుగ్గాని పల్లె పంచా యితీ చెప్పినాడు.

''సంగమోళ్లు కేసు పెడదాం లెమ్మన్నారు.

''ఈ మాట గౌడుకు తెలిసింది.

''రేత్రికి రేత్రి బైట పండుకున్న పిల్లోన్ని జీపులో యేస్కపోయినారు. రెడ్డి మనుషులు పిల్లోన్ని కాజేసినా కాజేస్తారు. ఇంగిప్పుడు కోర్టుకు పోతేగానీ దక్కడని అందరు అంటున్నారు. నువ్వే చూడల్ల,'' ఏడ్చుకుంటూ కాళ్లమీద పన్నాడు.

పెద్దమనిషి. చిన్నప్పట్నుంచి ఎత్తుకోని తిరిగి నోడు. కాళ్ల మీద పడితే దేవరత్నంకు దిక్కు తోచలేదు. పాలుపోలేదు.

''ఈ వూర్లో వాళ్లకెదురు నిలబడి మాట్లాడ్డం పోలీ సోళ్లకూ, జడ్జీలకే చాతగాదు. నేనెంత చిన్నాయినా!'' అన్నాడు.

''ఆ మాట అనొద్దు. వొగకులం గాకపోయినా, వొగ గేరిలో పెరిగినారు. వోబులేసు నీ తమ్ముని లెక్క టోడు. ఆపదిలో చెయ్యిడసొద్దు కొడకా,'' అని చెయ్యి పట్టుకున్నాడు.

''సంగమోళ్లు మళ్లీ ఎమ్మార్వోకాడికి పొయినారు. అందురు గలిశన్నా నా పిల్లోన్ని నాకిప్పియ్యండి.''

దేవరత్నంకు దిగులుగానే వుంది కానీ దిగులును మించిన భయం . ''కోర్టుకు టైమైంది. సాయింత్రానికి రా! చాతనైంది చేద్దాం,'' తాత్కాలికంగా తప్పుకున్నాడు.

కోర్టుకు పోయినా అదే ధ్యాస. వోబులేసును ఇడిపించడం ఎట్లా?

''సోమవారం కోర్టు కొత్త బిల్డింగ్‌లు ప్రారం భోత్సవం...''

''ముఖ్యమంత్రి వొస్తున్నాడు...''

''ఎం.ఎల్.ఎ. కాంతారెడ్డి చీఫ్ గెస్ట్...''

చెట్లకింద లాయర్లు మాట్లాడుకుంటున్నారు. కోర్టు భవనం పైన వేలాడుతున్న కత్తి... సమున్నతంగా ఎగురుతున్న జెండా! శవాల వాసనలు వెదజల్లుతూ...

అక్కడ వుండలేకపోయినాడు. బెయిల్ పిటిషన్ వుంటే స్నేహితునికి అప్పజెప్పి ఇంటికొచ్చినాడు.

'కేసు పట్టుకున్నట్టు తెలిస్తే చాలు ఇంటికి పిలు పొస్తుంది,' ఎట్లా విడిపించడం... దారి దొరకడం లేదు. కత్తి వేలాడుతూనే వుంది.

**సాయంత్రం 3 గంటలు**

మద్దన్న మళ్లీ ఇంటికొచ్చినాడు. వెంట నలుగురు సంఘం వాళ్లు. చూసిన మొహాలే. కుర్చీల్లో కూర్చు న్నారు. మద్దన్న గోడకు జారగిలపడ్డాడు.

''లెయ్యిలెయ్యి! పైన గూర్చో,'' సంఘం వాళ్లు లేపినారు.

''వద్దు సారూ! సదువుకున్నోళ్లు, రేత్రనక, పగల నక మాకోసం అతిరంగ తిరుగుతున్నారు. మీకు గాక పోతే ఎవరికియ్యల్ల గౌరువం,'' మొండిగా కిందనే కూర్చున్నాడు.

''వోబులేసును కొట్కుంటూ తీస్కపోవడం గేర్లో అందరూ చూసినారు. స్టేషనుకు బొయ్యి కేసు గూడ పెట్టొస్తున్నాం. ముందు కంప్లయింటే తీస్కోలేదు. బాగా కొట్లాడ్తే సి.ఐ.తో మాట్లాడినాకగానీ రిజిష్టరు చేసుకో లేదు,'' కంప్లైంటు కాపీ టేబులు మీద పెడుతూ చెప్పాడు వొకతను.

"సాక్ష్యం ఇస్తారా?" దేవరత్నం వాళ్లను అడిగాడు.

"ఎవరి భయం వాళ్లకుంది. ఎవురు మాత్రం ముందుకు పడ్తారు. వొగ ప్రకాశరాజు మాత్రం సిద్ధమైనాడు."

"రేపు శనివారం, ఎల్లుండి ఆదివారం. కోర్టుకు సెలవులు. అయినా పోలీసుల దగ్గరుంటే సెర్చ్ వారంట్ ఎయ్యొచ్చు. ప్రైవేటు వ్యక్తులు ఎత్తుకపోతే కోర్టు మాత్రం ఏం చెయ్యగలుగుతుంది."

"హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేస్తే," ఎవరో అన్నారు. ఇంకా వాళ్లు దగ్గర విషయాన్ని దాచి లాభం లేదనుకున్నాడు దేవరత్నం. మొహమాటపడితే సమస్య తన మెడకు చుట్టుకోవచ్చు.

"వోబులేసును కాపాడాలన్న ఆత్రుత నాకూ వుంది. బాధా వుంది. నేను ఎంతటి వకీలునైనా ఈ వూర్లో వాళ్లకెదురు నిలబడేంత ధైర్యంలేదు. నేను చదువుకున్న వాణ్ణయినా యింగా మాలోణ్ణే! ఏదో కష్టపడి ఈరోజు ఇట్లా నిలబడ్నాను. యింగ వృత్తిలో గూడ నిలబడాలి. ఫ్యాక్షన్లతో సంబంధాలు లేకుండా కేసులు తెంపుకోవడం కుదరదు. సగానికి సగం కేసులు కోర్టుల్లో కాదు. ముఠా నాయకుల ఇండ్లలోనే తెగేది. ఈ ఊర్లో పెద్ద పెద్ద వకీళ్లందరూ ఇంతకుముందు ఫ్యాక్షన్ నడిపిన వాళ్లో, వాళ్ల బంధువులో, లేకపోతే వాళ్లతో మంచి సంబంధాలు వున్నవాళ్లో. ఈ విషయం మీకూ తెలుసు. పొద్దున్నే లేచి వాళ్ల దర్శనం చేసుకోకుండా, వాళ్లకు దండ లెయ్యకుండా ఎదురు నిలబడితే బతుకూ వుండదు, బతుకు దెరువూ వుండదు. ఇప్పుడిప్పుడే కాస్త గుర్తింపు వొచ్చి నలుగురి దృష్టిలో పడ్నాను," దేవరత్నం స్పష్టంగా చెప్తున్నాడు.

"ఆ నలుగురూ ముఠా నాయకులేనా." నలుగురిలో వొకడు కటువుగా మాట్లాడాడు. పక్కనున్న వాళ్లు సర్ది చెప్పారు.

"మీ వెంట సంఘం వుంది. నిలబడండి. మేము అండగా వుంటాం," హామీ ఇచ్చారు. "వుంటారు సరే, నాకా ధైర్యం లేదు. అంత రిస్క్ ఫేస్ చెయ్యలేను. దయచేసి ఇంకో లాయర్ని మాట్లాడండి," దేవరత్నం కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

కూర్చున్న వాళ్లెవరూ మాట్లాడలేదు. కుర్చీల్లోంచి లేవలేదు.

"వూర్లో వకీళ్లెవరూ ముందుకు రాలేదు. నీమీద ఆశ పెట్కొంటి. మావోడివి. నువ్వే కాదంటే ఇంగెవురు చేస్తారు తండ్రీ!" మద్దన్న ఏడుస్తున్నాడు.

బతుకులో అడుగడుగునా చేతగానితనం, దేవరత్నంను వొక్క అంగుళం కూడా కదిలిచ్చలేకపోయింది. అసహాయత నటించాడు.

"మళ్లీ ఆలోచించండి! రేపు ప్రజాసంఘాల వాళ్లం దరం కర్నూల్లో కలెక్టరును కలవడానికిపోతున్నాం. వీలైతే రండి," నలుగురిలో ఎవరో చేయి కలిపి పోయారు.

మెడమీద వేలాడే కత్తి... వెంటాడే కత్తి...

బార్ రూములో ఆ బాపనోళ్ల మధ్య, రెడ్ల మధ్య ఇమడలేని కుల అంతరం...

నా వాళ్లకు దూరమైన నేను పరాయి ప్రపంచంలో బతకగలనా? నేను అనుకున్నా బతకనిస్తారా!

పెద్ద గాసగాళ్ల లెక్కగ వాండ్ల ఇండ్ల ముందు కాపలా కాస్తేనే నాకు బతుకుదెరువూ, కేసులూ, గౌరవం, ఆస్తి.

నావాళ్లనూ, ఆశలనూ, ఆత్మగౌరవాన్నీ చంపుకుని ఇంక బతికితే ఎంత, బతక్కపోతే ఎంత !

ఈ వొంటరితనంలో ఎవరైనా తోడొస్తారా!

ఎవ్వరూ రారు...

**సోమవారం పొద్దున**

"కె.సి. కెనాల్లో గుర్తు తెలియని శవం." -పేపర్లో వార్త.

"ఆ శవం వోబులేసుదే." -సంఘం ప్రకటన.

"కలెక్టరు ఆఫీసు ముందు ధర్నా" -దళిత, ప్రజా సంఘాల పిలుపు.

కడుపులో కెలికినట్లయ్యింది. తల తిరిగి కూలబడ్నాడు. శరీరం మొద్దుబారిపోయింది.

"చంపేశారా!..."

లేచి స్కూటరు బైటికితీశాడు. నేరుగా ఆస్పత్రికి... ఎదురుగా ఏమొస్తున్నాయో తెలియడం లేదు.

వొకే దృశ్యం... అస్పష్టంగా... కళ్లద్దాల వెనుక నిండిన నీటిపొర మాటున...

స్కూటరు పోస్టుమార్టం గది ముందు ఆగింది. దేవరత్నంను ఎవ్వరూ పట్టించుకోలేదు. మార్చురీ మెట్ల మీద పడిపోయిన మద్దన్న తలతిప్పి చూసినాడు. ఆ చూపు... బొడ్డులో తగిలింది. ఆ చూపులో ఎంత అసహ్యం... తను వొంటరివాడు... తనవాళ్ల మధ్యనే వొంటరి... దేవరత్నం మనుషుల్ని దాటుకొని మెట్లెక్కుతున్నాడు.

"సావు సూడ్డానికొస్తివా నాయినా!" వోబులేసు తల్లి పరిగెత్తుకొచ్చి కాళ్లు పట్టుకుంది. దేవరత్నం కూలబడ్నాడు. అతని మోకాళ్లకు తలబాదుకొని ఆమె

ఏడుస్తూ వుంది. ఆమెను ఈడ్చుకపోయి చెట్టుకింద కూచ్చోబెట్నారు. దేవరత్నం లేచి మార్చురీలోకి పోబోయినాడు.

''లోపలికి పోతే తట్టుకోలేవు,'' ముసలాయిన ఆపినాడు. విదిలించుకొని లోపలికి పోయినాడు.

శవాల వాసన, ముఠాలతో కుళ్లిపోయిన బతుకు వాసన. కళ్లు తిరిగి వాంతికొచ్చింది. ఆపుకున్నాడు.

వొక సిమెంటు దిమ్మె మీద పింగాణీ తొట్టిలో వోబులేసు శవాన్ని పడేసినారు. ముఖం రాళ్లతో చెక్కేసినట్టు వుంది. గుర్తుపట్టడానికి వీలేలేదు. శరీరాన్ని అక్కడక్కడా చేపలు కొరికినాయి. చొక్కా గుండీలు తీశారు. పోస్టుమార్టం కోసం పాంటు జననాంగం వరకు విప్పతీసి వుంది. అక్కడా చేపలు కొరికిన గుర్తులే. శవం ఉబ్బి కుళ్లినా, మోకాళ్ల దగ్గర ఇంకా గడ్డకట్టి వుంది. ఇంక చూడలేకపోయాడు దేవరత్నం. వెనక్కు తిరిగినాడు. మళ్లీ ఈసారి చూడాలనిపించింది. తెల్లగా చివికిపోయిన శరీరం మెడచుట్టూ ఇంకా కనిపిస్తున్న నల్లటి కమిలిన గుర్తులు. దగ్గరికి పోయి తాకి చూపినాడు. కాలర్ బోన్ విరిగింది...

వెంటాడుతున్న మార్చురీ వాసన.

వేటాడుతున్న మార్చురీ వాసన.

''వూర్లో సంగం పెట్నప్పట్నుంచి ఏటుకోసం కాచుకోనుండారు. అన్ని పన్లకూ వోబులేసుగానే ముందుకొస్తన్నాడని కసి పెంచుకున్నారు.''

''వొగ రోజంతా బద్దెపల్లెలో యేసి కొట్నారంట. సచ్చిపోయినంక మూటగట్టి కెనాల్లో దొబ్బినారు.''

''కెనాలు గేటు దెరిస్తే నీల్లొచ్చి జూపాడు బంగ్లా కాడ శవం వాగిందంట,'' గుంపులు, గుంపులుగా అవే మాటలు..

ఇక్కడ అటువంటి హత్యలు జరిగిన ప్రతిసారీ మాట్లాడుకుంటుండే అవే మాటలు...

*

ఆ అర్థరాత్రి గదిలో వొంటరిగా ఆలోచిస్తూ కూర్చున్న దేవరత్నం కళ్ల ముందు ప్రతి దృశ్యం ముందుకూ వెనక్కూ కదులుతూ వుంది.

కేసు కంప్లైంటు తయారవుతూ వుంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26 అక్టోబర్ 1997*